క్లుప్తంగా

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ


విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న దృశ్యం

జి.సిగడాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు జి.సిగడాం గ్రామానికి చెందిన చెల్లూరి వెంకటసత్యనారాయణ పరీక్ష సామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒత్తిడికి గురికాకుండా పరీక్ష రాయాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.వి.ఎస్ నర్సింహంమూర్తి, ఉపాధ్యాయులు, కుప్పిలి రవికుమార్ పట్నాయక్, తారకేశ్వరావు పాల్గొన్నారు.

పశువులకు వైద్య సేవలు


పశువులకు వైద్యం చేస్తున్న సిబ్బంది

జి.సిగడాం: సమాచారం అందిన వెంటనే వాహనం ద్వారా చేరుకొని పశువులకు వైద్య సేవలు అందిస్తున్నామని లావేరు, జి.సిగడాం వైఎస్సార్ సంచార పశుఆరోగ్యసేవ వైద్యాధికారిణి శ్రావణి చెప్పారు. జాడ గ్రామానికి చెందిన రైతు 1962 టోల్‌ఫ్రీ నంబర్‌కు శుక్రవారం ఫోన్ చేయడంతో వాహనంతో సకాలంలో చేరుకొని పశువులకు వైద్యసేవలు అందించామన్నారు. సచివాలయాల పరిధిలో ఉన్న వెటర్నరీ అసిస్టెంట్లు కూడా మెరుగైన సేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పైలెట్ పట్టాభి, లిఖిత పాల్గొన్నారు.

అల్లినగరంలో పారిశుధ్య పనులు


కాలువలో పూడిక తీస్తున్న కార్మికులు

ఎచ్చెర్ల: అల్లినగరం గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య పనులు శుక్రవారం చేపట్టారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికలు, వీధుల్లో చెత్తా చెదారాలను తొలగించి డంపింగ్ యార్డ్‌కు తరలించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సచివాలయ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు.

పరీక్ష కేంద్రం పరిశీలన


హాజరు పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ విఠలేశ్వరరావు

గార: మండలంలోని కళింగపట్నం కోకావారి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలను అడిషన్ ఎస్పీ విఠలేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. పరీక్షకు హాజరు, ప్రశ్నాపత్రాలను తనిఖీ చేశారు. కళాశాల పరిస్థితులపై ప్రిన్సిపాల్ ఆనంద్‌కుమార్ రాయుడును అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు ఎస్ఐ ఎం.మధుసూదనరావు ఉన్నారు.

ఘనంగా విజయదుర్గ ఆలయ వార్షికోత్సవం


పూజల్లో పాల్గొన్న భక్తజనం

లావేరు: తామాడ గ్రామంలోని విజయదుర్గ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. అమ్మవారిని పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి హోమాలు, నక్షత్రహారతి, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పాలిశెట్టి మధుబాబు, ఉమ దంపతులు, భక్తులతో అర్చకులు జోశ్యుల నాగేశ్వరశర్మ, సాయిశర్మలు పూజలు చేయించారు. తామాడ, పాతరౌతుపేట, కొత్తరౌతుపేట, నేతేరు గ్రామాలకు చెందిన భక్తులు పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

దేవీ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న పీఠాధిపతి

ఎచ్చెర్ల: కుంచాలకుర్మయ్యపేట దేవీ ఆశ్రమంలో శుక్రవారం పలు ప్రత్యేక పూజలు జరిగాయి. దేవీ విగ్రహానికి పీఠాధిపతి బాలభాస్కర శర్మ అభిషేకాలను నిర్వహించారు. సుహాసినీలు కుంకుమార్చనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

ఊపందుకున్న 'ఉపాధి'

- సొంత గ్రామంలో పనులు
- వేతనదారులకు అదనపు పనిదినాలు

ఎచ్చెర్ల:

గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు ఊపందుకున్నాయి. ఉన్న ఊరులోనే పనులు కల్పించడం ద్వారా ఉపాధి కోసం దూర ప్రాంతాలకు గ్రామీణులు వెళ్లకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఎచ్చెర్ల మండలంలోని 26 పంచాయతీల్లో 22,305 జాబ్‌కార్డు కలిగిన కుటుంబాలు ఉండగా.. వీటి పరిధిలో 38,366 మంది వేతనదారులు ఉన్నారు. వీరిలో సుమారు 17 వేల మంది రోజూ ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారు. సాగు నీటి చెరువులు, పంట కాలువల్లో పూడికతీత, మట్టి రోడ్లు, రైతుల పొలాల చుట్టూ గట్లు పటిష్టత, పండ్ల తోటల పెంపకం, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి సంరక్షించి పెంచడం, చెక్ డ్యాంల నిర్మాణం, కొండ ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండేలా నీటి గుంతలు, ట్రెంచ్‌లు తవ్వడం వంటి పలు రకాల పనులను ఉపాధి హామీ పథకంలో చేస్తున్నారు.


జర్జాం చెరువులో పనులు చేస్తున్న వేతనదారులు


తంగివానిపేటలో ఉపాధి నిధులతో శ్మశానానికి వేసిన రోడ్డు

లక్ష్యానికి మించి పనిదినాలు

ఈ ఏడాది మండలంలో వేతనదారులకు పది లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యం కాగా ఇప్పటికే 10,27,301 పనిదినాలను అధికారులు కల్పించారు. రోజుకు ఒక్కో వేతనదారుకి సగటున రూ. 195 వేతనం అందేలా చేశారు. ఇప్పటివరకు వేతనదారులకు, పనులకు, మెటీరియల్ రూపంలో 18.76 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. ఈ ఏడాది మండలంలో 1254 పనులను చేపట్టాలని లక్ష్యం కాగా సుమారు 300 పనులు పూర్తికాగామిగతావి ఆఖరిదశకు చేరుకున్నాయని అధికారులు చెబుతున్నారు. అమృత సరోవర్ చెరువుల అభివృద్ధిలో భాగంగా పొన్నాడ, ఫరీదుపేట, అల్లినగరం గ్రామాల్లో చెరువులను అభివృద్ధి చేసి 80 ఎకరాలకు సాగునీరు అందేలా చేశారు. పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన రోడ్ల వల్ల రైతులకు రవాణా కష్టాలు తొలగాయి. చెరువులు, చెక్‌డ్యాంలు వల్ల పంటలకు సాగునీరు అందేలా చేయడమేగాక కొండ ప్రదేశాల్లో ఏర్పాటు చేస్తున్న ట్రెంచ్‌లు వల్ల భూగర్భజలాలు పెంపొందుతున్నాయి.

సొంత గ్రామంలోనే ఉపాధి

జాబ్‌కార్డుదారులకు గ్రామంలోనే పని కల్పిస్తాం. దూర ప్రాంతాలకు వలస వెళ్లకుండా సొంత గ్రామంలోనే కుటుంబ సభ్యులతో కలిసి ఉపాధి పనులు చేసుకోవచ్చు. ప్రభుత్వ నిబంధనలు, కొలతల ప్రకారం పనులు చేస్తే ఒక్కో వేతనదారుకి రోజుకు రూ. 257 వరకు వేతనం గిట్టుబాటు అవుతుంది

–శోభాదేవి, ఏపీవో, ఎస్ఆర్ఈజీఎస్

జీతాల చెల్లింపు వేగవంతం చేయాలి

- డీఈవోకు వినతిపత్రం అందజేత


డీఈవో పగడాలమ్మకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: డీఎస్సీ 2002 హిందీ భాషా పండితులకు 45 నెలల బకాయి జీతాల చెల్లింపునకు ప్రభుత్వం అనుమతులు జారీ చేసిన నేపథ్యంలో, ఆ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లాశాఖ అధ్యక్షుడు పిసిని వసంతరావు, సహధ్యక్షుడు కుప్పన్నగారి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి గార పగడాలమ్మను డీఈఓ కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. వివిధ కారణాలతో సుదీర్ఘంగా పెండింగ్‌లో ఉన్న జీతాల సమస్యకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో పరిష్కారం లభించిందన్నారు. ఇప్పటికే చాలా జాప్యం జరిగినందున తదుపరి ప్రక్రియను తక్షణమే పూర్తిచేసేలా చూడాలని విన్నవించారు. సంబంధిత డ్రాయింగ్ అధికారుల ద్వారా భాషా పండితుల ట్రెజరీ ఐడీ నంబర్లు కోసం ప్రతిపాదనలు పంపించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన డీఈవో తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్టు వసంతరావు తెలిపారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 25 మంది ఎంపిక


విద్యార్థులను ఇంటర్వ్యూ చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని వెంకటేశ్వరా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం బెంగళూరుకు చెందిన మ్యాన్‌టెక్ సంస్థ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. సివిల్, సీఎస్ఈ, మెకానికల్, ఈసీఈ, ట్రిపుల్ ఈ బ్రాంచ్‌ల నుంచి 135 మంది హాజరవ్వగా.. 25 మంది ఎంపికయ్యారు. వీరికి ఆఫర్ లెటర్లు మెయిల్‌లో అందించనున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఇంటర్వ్యూలను హెచ్ఆర్ మేనేజర్ కేశవ్ రెడ్డి, రిక్రూట్‌మెంట్ మేనేజర్ అభిషేక్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రమణమూర్తినాయుడు, మేనేజ్‌మెంట్ సభ్యుడు డాక్టర్ బీవీఎస్ఎన్ మూర్తి, ప్లేస్‌మెంట్ అధికారి అనెం అప్పారావు పర్యవేక్షించారు.

సాగులో యాజమాన్య ఖర్చులు తగ్గాలి


పొలంబడి నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: పంటల సాగులో యాజమాన్య ఖర్చులు తగ్గాలని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మాస్టర్ ట్రైనర్ లక్ష్మున్నాయుడు అన్నారు. జరజాం పంచాయతీ గొలివివానిపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పొలంబడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు విత్తన ఎంపిక నుంచి సాగులో మెలకువలు పాటించటం వల్ల మంచి దిగుబడులు సాధ్యమని వివరించారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గించి పశువుల ఎరువులు, ఘన, ద్రవ జీవామృతాలు, కషాయాలు వినియోగానికి రైతులు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నవధాన్యాలు, పచ్చిరొట్ట సాగు వల్ల తక్కువ ఖర్చుతో భూమి సారవంతంగా మారుతుందని చెప్పారు. కార్యక్రమంలో లీడ్ ఫార్మర్లు రామకృష్ణ పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం


వైద్య శిబిరం ప్రారంభిస్తున్న ఓబులేసు

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని సూర్యమహల్ కూడలి వద్ద జిల్లా ఆయుష్ విభాగం, మారుతీ వాకర్స్ క్లబ్‌లు శుక్రవారం ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని కమిషనర్ చల్లా ఓబులేసు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనిషి ఆరోగ్యానికి హోమియో, యోగా, ఆయుష్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం రెడ్‌క్రాస్ ఏర్పాటు చేసిన సీపీఆర్ డెమోను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆయుష్ విభాగం రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ వై.శేఖర్, సీనియర్ మెడికల్ అధికారులు పి.జగదీష్, వి.సీతామహలక్ష్మి, పి.పద్మజ, టి.సుజాత, ఎం.లక్ష్మీప్రసన్న, హనుమంతు కృష్ణారావు, పి.జగన్మోహనరావు, మారుతీ వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కొంక్యాణ మురళీధర్, పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మోహన్‌రాజుకు డాక్టరేట్


డాక్టరేట్ పట్టా అందుకుంటున్న పీడీ మోహన్‌రాజు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్) కళాశాల వ్యాయామ విద్య హెచ్‌వోడీ అడపా మోహన్‌రాజు ఆంధ్రా యూనివర్సిటీ విశాఖపట్నం వీసీ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం డాక్టరేట్ పట్టా ప్రొసీడింగ్స్‌ను అందుకున్నారు. 'కళాశాల అథ్లెట్స్‌లలో హారిజంటల్, వర్టికల్ స్ప్రింటింగ్, జంపింగ్‌లో ప్లయోమెట్రిక్ శిక్షణా ప్రభావం' అనే అంశంపై ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ ఎన్.విజయమోహన్ పర్యవేక్షణలో పరిశోధనను పూర్తిచేశారు. పీడీ మోహన్‌రాజు డాక్టరేట్ పట్టా అందుకోవడంపై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎంవీ సత్యనారాయణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ శాంతిదేవి, డాక్టర్ డి.పైడితల్లి, డాక్టర్ వై.పోలినాయుడు, బీఆర్ఏయూ ఈసీ సభ్యులు డాక్టర్ చిన్నారావు, హెచ్.లక్ష్మీపతి, ఏవో సూర్యప్రకాష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి


తాళ్లవలసలో పరిసరాలు పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

లావేరు: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని లావేరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టరు మౌనిక, డాక్టరు మణిభూషణ్ అన్నారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో శుక్రవారం డ్రై ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి పరిసరాలు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. జనావాసాల మధ్య ఉండే చెత్తకుప్పలు, మురుగునీరు గుర్తించి వాటిని తొలగించాలని స్థానికులకు సూచించారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన డీఈవో


విద్యా సామర్థ్యాలు పరిశీలిస్తున్న డీఈవో పగడాలమ్మ

లావేరు: మురపాక పంచాయతీ పరిధి సీహెచ్ అగ్రహారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారిణి జి.పగడాలమ్మ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలపై ఆరా తీశారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను పరిశీలించారు. పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో నాలుగు సంవత్సరాలుగా ప్రైవేటు భవనాల్లో పాఠశాలను నిర్వహిస్తున్నట్టు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు డీఈవో పగడాలమ్మ దృష్టికి తీసుకెళ్లారు. నూతన భవనాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి ఆమె స్పందిస్తూ ఇదివరకే ఎంఈవో ద్వారా నివేదిక తెప్పించుకొని నూన భవనాల మంజూరు కోసం ప్రభుత్వానికి, ఉన్నతాధికారులుకు ప్రతిపాదనలు పంపించినట్టు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో భవనాల పరిస్థితి చూశానని.. నూతన భవనాల మంజూరుకు తనవంతు కృషి చేస్తానని డీఈవో అన్నారు. లావేరు ఎంఈవో ఎల్.ఈశ్వరరావు, సీఆర్పీ వి.గోవిందరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పెయ్యల లక్ష్మణరావు, తేనేల సురేష్‌కుమార్, వార్డు మెంబర్లు వై.ఈశ్వరరావు, ఎం.చంద్రరరావు ఉన్నారు.

సైన్స్ ఆవిష్కరణలు కీలకం


సైన్స్ ప్రాజెక్టులను పరిశీలిస్తున్న అధికారులు

రణస్థలం: విద్యార్థుల ప్రగతిలో సైన్స్ ఆవిష్కరణలు ఎంతో కీలకమని జిల్లా ఉప విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య అన్నారు. కోష్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అరబిందో ఫౌండేషన్ వారి సౌజన్యంతో అమెరికన్ ఇండో ఫౌండేషన్ వారు సాంకేతిక సైన్స్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం నిర్వహించారు. ఉత్తమంగా రూపొందించిన ప్రాజెక్టులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు సృజనాత్మకమైన ధోరణిలో నడవాలని, ఆవిష్కరణలు చదువులో భాగం కావాలన్నారు. క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం జగన్నాథరావు, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు విశ్వ కళ్లేపల్లి, అరబిందో ప్రతినిధులు, గ్రామ సర్పంచ్ పిసిని హరిబాబు, నాయకులు పిసిని లక్ష్మణావు, పల్లె సత్యం, ఉపాధ్యాయులు ఉన్నారు.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం


బాడీ బిల్డింగ్ క్రీడాకారులతో డాక్టర్ దానేటి శ్రీధర్ తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శారీరక వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో బాడీ బిల్డింగ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాడీ బిల్డింగ్ ఎంతో ఖర్చుతో కూడుకున్నదని, అటువంటి క్రీడలో రాణిస్తూ ముందుకు సాగుతుండడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం మారుతున్న ఆహారపు అలవాట్ల నేపథ్యంలో చిన్న వయసులోనే అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉంటారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రటరీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీన 25వ మిస్టర్ ఆంధ్రా రాష్ట్రస్థాయి పోటీలను శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల వేదికగా నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు. కార్యక్రమంలో బాడీ బిల్డర్లు నవీ, రఫీ, శేఖర్, మదీనా, మధులతో పాటు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.ప్రసాద్, మనోజ్‌కుమార్ మండల, టీమ్ మేనేజర్ కె.గౌరీ శంకర్ (ఆమదాలవలస) తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు


విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న నాగేశ్వరరావు

శ్రీకాకుళం అర్బన్: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు కింతలి నాగేశ్వరరావు ఆకాంక్షించారు. నగరంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల్లో మంచి మార్కులు సాధించినవారికి నగదు బహుమతి అందజేస్తామన్నారు. జేసీఐ నటుకుల మోహన్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి మార్కులు సాధిస్తారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అకాల వర్షంతో మొక్కజొన్న రైతుల ఆందోళన


జి.సిగడాంలో మొక్కజొన్న కంకులపై టార్పలిన్ కప్పిన దృశ్యం

జి.సిగడాం: వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో మొక్కజొన్న రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటను కోసేసి రోడ్లపై ఆరబెట్టారు. అయితే గురువారం రాత్రి అకస్మాత్తుగా వర్షం కురిసింది. దీంతో కంకులు తడిచిపోవడంతో రైతులు ఆందోళన చెందారు. టార్పన్లు కప్పి కంకులు తడవకుండా ప్రయత్నించారు. పాలఖండ్యాం, మెట్టవలస, జి.సిగడాం, గేదెలపేట, బాతువ, సీతంపేట, నడిమివలస జాడ, ముషినివలస, చంద్రయ్యపేట, వెలగాడ గ్రామాల్లో మొక్కజొన్నను రైతులు అధికంగా సాగు చేశారు.


ఉప్పుటేరు పొలంలో సాగు చేస్తున్న ఖర్బూజా పంట

తీరం చెంత.. కాసుల పంట

- ఉప్పుటేరు పొలాల్లో వినూత్న ప్రయోగం
- ఖర్బూజా సాగుతో లాభాలు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలో డొంకూరు తీర ప్రాంతంలోని ఉప్పుటేరు పంట పొలాలు నిత్యం ఇసుకతో నిండి ఉంటాయి. ఈ పొలాల్లో సాగుచేసే రైతులకు ప్రతి ఏడాది నష్టాలే వెంటాడుతుంటాయి. వర్షాలు ఎక్కువగా కురిసినా, కురవకపోయినా ఇబ్బందులు తప్పవు. పూర్తిగా వర్షాధారంపై ఆధారపడే ఇక్కడి రైతులు వరిపంటపై ఆశలు వదులుకొని వాణిజ్య సంబంధిత ఉద్యానవన పంటలను నమ్ముకుంటారు. అయితే గత మూడేళ్లుగా గ్రామానికి చెందిన దున్న ఆదినారాయణ, దున్న సోమేశ్వరరావు, దున్న మన్మథరావులు చెరో ఎకరంలో ఖర్బూజా పంటను పండిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. ఉప్పుటేరు పొలాలు అయితేనేం ధైర్యంతో ముందడుగు వేసి, విద్యుత్ మోటారు సాయంతో ఖర్బూజ పంటతో పాటు టమాటా, పచ్చిమిర్చి, గోరు చిక్కుడు పంటలను సైతం పండిస్తున్నారు. ప్రస్తుతం ఈ పంటలకు మంచి గిరాకీ ఉండటంతో, ఇదే మాదిరిగా తీరప్రాంత రైతులు వాణిజ్య సంబంధ ఉద్యానవన పంటపై ఆసక్తిని చూపిస్తే మరింత మంచి ఫలితాలు వస్తాయని ఉద్యానవన అధికారులు పేర్కొంటున్నారు.


ఏపుగా పెరిగిన టమాటా పంట

రొయ్యల చెరువులతో చేటు



గత మూడేళ్లుగా ఇవే పంటలు పండిస్తున్నాము. ఈ ఏడాది అనుకున్న విధంగా తొలిదశలో ఖర్బూజ పంట కనిపించినా, కాస్తా దగ్గర్లో రొయ్యల చెరువులు ఉండడంతో వాటి ప్రభావం ఈ పంటపై పడింది. కాయ సైజు కూడా తగ్గింది. టమాట, పచ్చిమిర్చి పంటలు బాగున్నాయి. ఉద్యానవన, వ్యవసాయ అధికారులు సలహాలు ఇస్తే పాటిస్తాం.

– దుబ్బ ఆదినారాయణ, డొంకూరు

ఎమ్మెల్సీ చొరవతో ధాన్యం కొనుగోలు

టెక్కలి: నియోజకవర్గంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ చొరవతో రైతుల వద్ద మిగిలిపోయిన ధాన్యం కొనుగోలుకు అధికారులు చర్యలు చేపట్టా రు. ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీ దువ్వా డ కలిసి నియోజకవర్గంలో మిగిలిపోయిన ధాన్యం కొనుగోలుపై వినతిపత్రం అందజేశారు. దీంతో నియోజకవర్గంలో వ్యవసాయాధికారులు రైతు భరోసా కేంద్రాల్లో పర్యటిస్తున్నారు. అయితే మిల్లర్ల బ్యాంకు గ్యారంటీ లక్ష్యం పూర్తవ్వడంతో ట్రక్ షీట్ ప్రక్రియ నిలిపివేశారు. ఇప్పుడు మరలా ఉన్నతాధికారుల ఆదేశాలతో రైతు భరోసా కేంద్రాల పరిధిలో ట్రక్ షీట్ ప్రక్రియ ఆరంభించారు. నియోజకవర్గంలో మరో 10 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు చర్యలు చేపడుతున్నారు.